

# రియల్ ఎస్టేట్ మాఫియాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

## గాజుల రామారం భూ కబ్జాలపై దాసోజు శ్రవణ్ సంచలన ఆరోపణలు

- ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి భూ దోపిడీ
- ల్యాండ్ సీలింగ్ చట్టాలకు తూట్లు - పీవీ, రాజీవ్ గాంధీ చట్టాల నిర్వీర్యం
- పార్టీ మారితే భూముల రెగ్యులరైజేషన్ -నజరానా రాజకీయాలు
- గాజుల రామారం సర్వే నం.307లో 11 ఎకరాల అక్రమ కబ్జా ఆరోపణలు
- దమ్ముంటే 307 సర్వే నెంబర్ దగ్గరకు రావాలి
- బీజేపీ-కాంగ్రెస్ ఒక్కటే: దాసోజు శ్రవణ్
- దమ్ముంటే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలి



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయ్యాయని, కానీ ఈ రెండేళ్ల పాలనలో ప్రజా ప్రయోజనాలు మరిచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాఫియాలా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. దేశం గర్వించదగ్గ నేత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని, అలాగే రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన చట్టాలను ఉద్దేశపూర్వకంగా నీరుగార్చే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. భూములు ఎక్కువగా ఉన్న వారి నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీనే ఒకప్పుడు తీసుకొచ్చిన చట్టాలను నేడు అదే పార్టీ తూట్లు పొడుస్తోందన్నారు. పార్టీ పిరాయింపులకు పాల్పడిన నాయకులకు నజరానాలుగా వేల కోట్ల రూపాయల భూములను అక్రమంగా బదలాయిస్తున్నారని ఆరోపించారు. గాజుల రామారం ప్రాంతంలో అరికెపూడి గాంధీ 11 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేశారని, ఆయన పార్టీ మారిన వెంటనే ఆ భూమిని ల్యాండ్ రెగ్యులరైజ్ చేయడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డికి భజన చేస్తే చాలు, పార్టీ మారితే చాలు భూ బదలాయింపులు జరిగిపోతున్నాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గాజుల రామారం పరిధిలోని సర్వే నెంబర్ 307లో మెంత్తం 411 ఎకరాల భూమి ఉండగా, అందులో 317 ఎకరాలను ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. మిగిలిన 123 ఎకరాల 28 గుంటల భూమి మాత్రమే ప్రైవేట్ భూమిగా రికార్డుల్లో ఉందన్నారు. అయితే ల్యాండ్ సీలింగ్ కిందకి వచ్చే భూములపై అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 1980కు ముందే ల్యాండ్ సీలింగ్ కిందకి వచ్చిన భూమిని 1991లో షేక్ ఇమామ్ పేరుపై ఉన్నట్లు రికార్డులు చూపించడం, ఆయన అప్పటికే భూమిని అమ్మేసినా, 2006లో అమ్మినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం ఘోర నేరమన్నారు. ఆ భూమిలో 128.28 ఎకరాలను నలుగురు వ్యక్తులు విక్రయించినట్లు రికార్డులు ఉన్నాయని తెలిపారు. 2015 వరకు ఆ ప్రాంతంలో అభివృద్ధి జరిగినా, ఇప్పుడు అక్రమంగా భూములను తిరిగి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అరికెపూడి గాంధీ పార్టీ మారినప్పుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన నజరానా ఏమిటంటే ఇప్పటికే అమ్మిన భూమిని నకిలీ డాక్యుమెంట్లతో మళ్లీ అతని పేరుపై రిజిస్టర్ చేయించడం అని ఆరోపించారు. భూ భారతి పోర్టల్‌లో కూడా అరికెపూడి గాంధీ పేరుపై ఎంట్రీ చేయడం ప్రభుత్వ ప్రమేయం లేకుండా సాధ్యం కాదన్నారు. ఈ అక్రమాలపై మాధవరం కృష్ణారావు బాధ్యతగల ప్రజాప్రతినిధిగా సీసీఎల్ఏ, చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, హైడ్రా కమిషనర్, విజిలెన్స్ కమిషనర్, కూకట్పల్లి పోలీస్ కమిషనర్ సహా పలు శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. తాను కూడా హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు ఇవ్వగా, "రేపే చర్యలు తీసుకుంటాం" అని చెప్పినప్పటికీ, మరుసటి రోజే అక్కడ అక్రమ బౌండరీలు వేసినట్లు చెప్పారు.

తరతరాలుగా ప్రభుత్వానికి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ఎవరి సొమ్ము అని ప్రశ్నించారు. కబ్జాదారులను, దొంగలను అరికట్టకపోతే దేశాన్ని ఎవరూ కాపాడలేరన్నారు. పార్టీ మారితే వేల కోట్ల భూములు నజరానాగా ఇస్తారన్న ప్రచారం నిజమని ఆరోపించారు.

ఐడీపీఎల్ భూములపై విచారణ చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతూనే, అది కేవలం ఒక్క సర్వే నెంబర్‌కే పరిమితం చేయడం డ్రామా తప్ప మరొకటి కాదన్నారు. గాజుల రామారం సర్వే నెంబర్ 307పై ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. మాధవరం కృష్ణారావు పలుమార్లు పూర్తి స్థాయి విచారణ కోరినా పట్టించుకోలేదన్నారు. నియమనిబంధనలు పాటించకుండా హైడ్రా పేరు చెప్పి అక్రమ బ్లూ షీట్లు పెట్టడం జరుగుతోందన్నారు.

దమ్ముంటే గాజుల రామారం సర్వే నెంబర్ 307లోని భూముల వద్దకు రావాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. "అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు" ప్రభుత్వ భూములను పంచడం ఏ నైతికత అని నిలదీశారు. రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు తెచ్చిన చట్టాలను తానే అధికారంలోకి వచ్చి నాశనం చేశారని విమర్శించారు. ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ఉన్న భూముల్లో జరుగుతున్న అన్ని కార్యకలాపాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అనుమతులు ఇచ్చిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని కోరారు. భూ భారతి అంటే బోగస్ భారతి అయ్యిందా? అని ప్రశ్నించారు. ఐడీపీఎల్ భూములపై ఎలాంటి విచారణ జరుగుతోందో, అదే విధంగా గాజుల రామారం సర్వే నెంబర్ 307పై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ముఖ్యమంత్రి మధ్య సమన్వయం లేదని, హిల్‌టాప్ పాలసీ డాక్యుమెంట్లను మంత్రులే బయటకు ఇచ్చారని ఆరోపించారు. ప్రతి రోజు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల పేర్లు చెప్పడం తప్ప రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలపై మాట్లాడటం లేదన్నారు. ప్రతిపక్ష నేతలపై బురదజల్లితే ప్రజలు నమ్మరని హెచ్చరించారు. ఏకగ్రీవ ఎన్నికల పేరుతో బెదిరింపులకు పాల్పడిన విషయం ప్రజలు చూశారన్నారు. అధికారంలో ఉన్న పార్టీ కేవలం 50 శాతం స్థానాలు మాత్రమే గెలవడం సిగ్గుచేటని, ప్రభుత్వం నిజంగా మంచి చేస్తే 90 శాతం స్థానాలు గెలవాల్సిందన్నారు. మహాలక్ష్మి, రైతు బంధు వంటి హామీలు గ్రామాల్లో అమలు కాలేదని, కానీ తాత%-%మనవడు ఆడుకోవడానికి ప్రభుత్వ ఖజానా నుంచి 200 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని విమర్శించారు. ఈ ఖర్చు ఎవరి కోసమని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కోర్టులో కేసులు నడుస్తుండగానే జీవో నెంబర్ 9 ఎవరి అనుమతితో ఇచ్చారని, ఎందుకు ఆగమేఘాల మీద ఎన్నికలు నిర్వహించారని ప్రశ్నించారు. దమ్ముంటే పార్టీ పిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కూని చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. దమ్ముంటే వెంటనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. స్పీకర్‌ను తప్పుదోవ పట్టించవద్దని, ఆయనకు మంచి అవకాశం ఉండేదన్నారు. అధికారంలోకి రావడం కోసం బండి సంజయ్‌ను బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తప్పించారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి అబద్ధాల రాజకీయాలు చేస్తున్నారని, మోదీని "బడే బాయ్" అన్న నాయకుడు దేశంలో మరొకరు లేరన్నారు. రాహుల్ గాంధీ "చౌకీదార్" అంటారని, రేవంత్ మాత్రం "బడే బాయ్" అంటారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, బీజేపీ రెండూ ఒక్కటేనని ఆరోపించారు. బీజేపీ మీడియా సమావేశాల్లో కూడా రేవంత్ రెడ్డిపై 10 శాతం విమర్శలు చేయడం లేదని, ఒకవేళ చేస్తే తాను ముక్కు నేలకు రాసిపోతానని అన్నారు.

బీజేపీ%-%బీఆర్ఎస్ ఒక్కటే అయితే కేసీఆర్‌పై కమిషన్లు ఎందుకు, కవితను జైలుకు ఎందుకు పంపారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇటు రాహుల్ గాంధీని, అటు నరేంద్ర మోదీని చూస్తూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు ఎన్నిసార్లు మోదీపై మాట్లాడారని ప్రశ్నించారు. కేటీఆర్ అమృత్ స్కామ్‌పై ఫిర్యాదు చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం రెండూ ఒకటేనని ఆరోపించారు.

# న్యాయవాదుల 5వ రాష్ట్ర సదస్సుకు తరలి రండి

**పరకాల, భూపాలపల్లి, ములుగు లో గోడ ప్రతుల ఆవిష్కరణ**

**భూపాలపల్లి, ములుగు బార్ అసోసియేషన్ అధ్యక్షుల పిలుపు**



భూపాలపల్లి, రోమింగ్ న్యూస్: సామాజికన్యాయం, న్యాయవాద హక్కులు, రక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ ఎల్ పి ఎ) 5వ రాష్ట్ర మహాసభలకు న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై సదస్సును జయప్రదం చేయాలని భూపాలపల్లి, ములుగు జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసాచారి, వేణుగోపాలచారి లు పిలుపునిచ్చారు. ఈ నెల 20 న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగు ఐ ఎల్ పి ఎ 5వ రాష్ట్ర సదస్సు గోడ పత్రికలను గురువారం భూపాలపల్లి ములుగు జిల్లా కోర్టుల ఆవరణలో విడుదల చేసి వారు మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు రక్షణ చట్టాలున్నాయని ప్రజల హక్కుల కోసం నిరంతరం వాదించే న్యాయవాదులకు రక్షణ చట్టం లేకపోవడం వల్లనే న్యాయవాదులపై, జడ్జీలపై దాడులు జరుగుతున్నాయని, హత్యలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ 80 ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో ఇంకా అసమానతల సమాజం కొనసాగడం శోచనీయమని వారు అన్నారు. సమాజంలో అత్యున్నత విద్యతో పాటు రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన ఉన్నత విద్యావంతులైన న్యాయవాదులు చైతన్యం చెందడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని ఆయన అన్నారు. మహిళా సమానత్వం, ఆయా వర్గాలకు సమ న్యాయం జరగాలని న్యాయవాదులతో పాటు ప్రజలను చైతన్యం చేస్తున్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని నరేందర్ మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ సిద్ధాంత పునాదితో పని చేస్తున్న ఐ ఎల్ పి ఎ మెజార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని, సామాజిక న్యాయం కోసం కోర్టుల్లో వాదించే న్యాయ శాఖలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకపోవడం వల్ల న్యాయశాఖలో అత్యున్నత స్థాయికి ఎదగడానికి అణగారిన వర్గాలకు అవకాశం లేకుండా పోయిందని అన్నారు. న్యాయవాదుల వృత్తిపరమైన అభివృద్ధితో పాటు సామాజిక చైతన్యం కల్పించడం ద్వారనే బహుజన సమాజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవచ్చని అన్నారు. సామాజిక న్యాయం కోసం ఐ ఎల్ పి ఎ చేస్తున్న పోరాటంలో న్యాయవాదులు కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20 న కొత్తగూడెంలో జరుగు రాష్ట్ర సదస్సులో రాజ్యాంగ విలువలు - ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ప్రజల హక్కులు, ఇ డబ్ల్యు ఎస్ కు లేని నిబంధన ఓబీసీ లకు ఎందుకు, మహిళా కోటాలో బహుజన కోటా, న్యాయవాద రక్షణ చట్టం అనే నాలుగు అంశాలపై జరుగు సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ హై కోర్టు జడ్జి, మాజీ జాతీయ ఓబీసీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, విశిష్ట అతిథులుగా కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్, అదనపు జిల్లా జడ్జి ఎస్ సరిత, గౌరవ అతిథులుగా రిటైర్డ్ ఐ ఎ ఎస్ అధికారి టి చిరంజీవులు, కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, ఐ ఎల్ పి ఎ జాతీయ అధ్యక్షులు సుజాత కె చౌదంటే, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత,కర్ణాటక సీనియర్ న్యాయవాది ఎస్ బాలన్, సుభాస్ చంద్ర బోస్, డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు లు హాజరవుతారని తెలిపారు. ఇట్టి సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి న్యాయవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర నాయకులు పంచగిరి బిక్షపతి, మెరుగు రవీందర్ భూపాలపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బల్ల మహేందర్, లైబ్రరీ సెక్రటరీ అక్షయ, స్పోర్ట్స్ సెక్రటరీ ఇందారపు శివకుమార్, పరకాల సీనియర్ న్యాయవాది పొన్నం రాజిరెడ్డి, పి.వెంకటరమణ, లక్కం శంకర్, దొగ్గెల రమేష్, తడక సురేష్, రమేష్, పవన్ కుమార్, భూపాలపల్లి న్యాయవాదులు పుప్పాల శ్రీనివాస్, కూనూరు సురేష్, ఎదులాపురం శ్రీనివాస్, రఫీక్, చిరంజీవి, మధురాక్షి, తిరుమల, లావణ్య, వసంత, కవిత, సైండ్ల నాగరాజు, షేక్ మొయినుద్దీన్, ఆనందరావు, మడిపల్లి రజనీకాంత్, నీలం ప్రశాంత్, లతీఫ్, అనిల్, శ్రీనివాస్, రాజేందర్, కూనూరు రంజిత్ గౌడ్, ములుగు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగోజు బిక్షపతి, ఉపాధ్యక్షులు మేకల మహేందర్, ట్రెజరర్ బానోతు స్వామిదాస్, సంయుక్త కార్యదర్శి ఓరుగంటి రాజేందర్, స్పోర్ట్స్ సెక్రటరీ రాచర్ల రాజుకుమార్, ములుగు న్యాయవాదులు వెంకటేశ్వరరావు, బి చంద్రయ్య, బల్ల ప్రతాప్, రంగోజు సూర్యం, లావణ్య, మన్సూర్ అలీ, అర్చన, గౌడి శ్రావ్య, కవిత నాతి, రాజ్ కుమార్, అరుణ్ కుమార్, చిరంజీవి, విజయ్, కల్తీ కుమారస్వామి, ప్రణయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామ పరిశుభ్రత అందరి బాధ్యత

**జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ కృషి అభినందనీయం**

**మున్సిపల్ కమిషనర్ మహేందర్ రెడ్డి**




జనగామ డిసెంబర్ 18: (రోమింగ్ న్యూస్) జనగామ జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ గా మహేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి జనగామ పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. పరిశుభ్రత విషయంలో ఎలాంటి మినహాయింపు లేకుండా సిబ్బందితో తనదైన శైలిలో వ్యవహరిస్తూ వారితో క్రమశిక్షణతో పనిచేయి స్తున్నారు. ఆయన చెప్పడమే కాకుండా అనేక సందర్భాలలో పారిశుధ్య విధి నిర్వహణలో సిబ్బందితో పాటు తాను కూడా ఒక కార్మికుడిలా పనిచేస్తూ చేసి చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ అనేక సంవత్సరాలుగా తిష్ట వేసిన కార్మిక సిబ్బంది తోపాటు కొంతమంది మొండి ఘటాలను కూడా కదిలిస్తూ పనిచేసేలా మాటలతో చేతులతో చెబుతూ పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. జనగామలో కంటికి అగుపడకుండా రికార్డులలో మాత్రమే కనిపించే పలు పార్కులు అనేక సంవత్సరాలుగా పాడుబడ్డ స్థలాలుగా ఉన్నాయి. ఇలాంటి పార్కులు చెత్తాచెదారాలతో పిచ్చి మొక్కలతో ఆకతాయిలకు, అకృత్యాలకు అడ్డగా మారి ఆయా ప్రాంత ప్రజలకు జుగుప్సను కలిగిస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించిన జనగామ కు చెందిన జీవన్ గ్రీన్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ వారి విజ్ఞప్తి మేరకు స్థానిక 14 వ వార్డులో అనేక సంవత్సరాలుగా పడావుబడ్డ మున్సిపల్ పార్కును పరిశుభ్ర పరిచయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్వచ్ఛంద సంస్థ వారి విజ్ఞప్తి మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టితో అంతంత మాత్రం గా ఉన్న మున్సిపల్ సిబ్బందితోపాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్రీమతి దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన పరిశుభ్రత కార్యక్రమంలో

పార్కును శుభ్రం చేయడంలో కమిషనర్ కూడా నడుం బిగించి చెత్తను తొలగించడంలో కృషి చేయడం ఆయన చిత్తశుద్ధికి, అంకిత భవానికి నిదర్శనమని దూసరి ధనలక్ష్మి అన్నారు. ఈ ప్రాంతం ఒక పార్కు అన్న విషయం అన్న విషయాన్ని ఈ ప్రాంత ప్రజలు మర్చిపోయారని మద్యపానం, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతూ, పాములు-కోతులు తిరుగుతూ, చెట్లు-చెత్త అధికంగా పెరిగి అటువైపు వెళ్ళాలన్నా భయంగా పరిస్థితి తయారయిందని అన్నారు. అటువంటి పరిస్థితుల్లో ఉన్న పార్క్‌ను గురువారం పూర్తిగా శుభ్రం చేసి, ప్రజలు నడక కోసం ఉపయోగించుకునేలా వాక్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు, పిల్లలు ఆనందంగా ఆడుకునేలా అనుకూల వాతావరణాన్ని కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు. ది నికొరకు సహకరించిన కమిషనర్, సిబ్బంది అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి, కాలేజీ లెక్చరర్, స్టాఫ్ కి, ఎన్. సి. సి. విద్యార్థులకు, వార్డు మహిళలకు జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరిగా మున్సిపల్ కమిషనర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జనగామ పరిశుభ్రత కొరకు జీవన్ సొసైటీ వారిలాగా ఆ వార్డులకు చెందిన ప్రజలు స్వచ్ఛంద సంస్థలు పరిశుభ్రతను కాపాడడంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో పరిశుభ్రతను కాపాడుకోవడంలోజనగామ ను అగ్రస్థానంలో ఉంచాలని ఆయన ఆకాంక్షించారు. ఇలాంటి పడావుపడ్డ ప్రాంతాలను, పార్కులను అంకితభావంతో పనిచేసే జీవన్ గ్రీన్ గ్రూప్ సొసైటీ, అమ్మ ఫౌండేషన్ లాంటి పలు స్వచ్ఛమైన స్వచ్ఛంద సంస్థలకు దత్తతను ఇచ్చి ఆయా ప్రాంతాల పరిశుభ్రతను కాపాడుతూ అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ను పట్టణ అభివృద్ధిని ఆకాంక్షించే పలువురు హితేషులు కోరుతున్నారు.





# జనగామలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి

జనగామ, డిసెంబర్ 18 (రోమింగ్ న్యూస్) : జనగామ జిల్లా

రఘునాథ్ పల్లి మండలం ఖిలా షాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్ తో రైతు బుధవారం రాత్రి మృతి చెందారు. ఖిల్లా షాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ నర్సింగరావు (దాదాపు 55 సంవత్సరాలు) అనే రైతు తన వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టడానికి మోటర్ ఆన్ చేసిన సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మరణించినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. తెగిపోయిన వైర్ల ద్వారా విద్యుత్ షాక్ తగిలి ప్రమాదవశాత్తు మరణించినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సిందే



